# అనగనగా ఒక కథ

జ్ఞం

# మంగళసూత్రాలు

## రైటరు చెప్పిన కథ

రామాచారి చెయ్యి తిరిగిన పని వాడు. బంగారు పని చెయ్యడంలో అతన్ని మించిన వాడెవడూ ఆ జిల్లాలోనే లేడని పేరొందాడు.

ముఖ్యంగా ఆడపెళ్ళి వారైనా మగపెళ్ళివారైనా అతను మంగళ సూత్రం చేస్తే మంగళప్రదమని భావించేవారు.

ఏభై ఏళ్ళుగా కొనసాగుతున్న రామాచారి వృత్తి అర్ధాంతరంగా ఆగిపోయింది!! ఎందుకు?

అదో విచిత్రమైన కథ...!

ఆ కథ చెప్పడానికి మనసు రావట్లేదు. కానీ కన్నీళ్ళు పెట్టుకుంటూ శెట్టిగారు చెప్పిన కథ విని తడిసిపోయిన గుండెతో ఈ కథ మీకు చెప్తున్నాను.

## శెట్టిగారు చెప్పిన కథ

రామాచారి మా కుటుంబానికి బంగారు నగలు చేయడానికి తరతరాలుగా ఉన్న పరంపరలోని వాడు.

మనిషి బంగారంలో పుట్టి, బంగారు పనిలో పెరిగి, ఆ బంగారాన్ని ఒంట్లోనూ, మనస్సులోనూ నింపుకున్నాడు.

అతని వేళ్ళలో ఏమి అద్భుతం ఉందో గానీ అతను చేసే నగలు బంగారంకన్నా మిలమిల లాడుతాయి.

ముఖ్యంగా రామాచారి మంగళసూత్రాలు చేస్తే అదో అద్భుతం!

మంగళసూత్రాలు చేస్తున్నంతసేపూ అతను సూత్రాలు గట్టిగా, పటిష్టంగా నిండు నూరేళ్ళూ మెరుస్తూండాలని మెరుగులు పెట్టాడు.

అతనికొక్కటే బాధ. బంగారంలో రాగి కలిస్తేగానీ అందమైన ఆకారం ఏర్పడదని, కానీ దాంపత్యంలో రాగి కలవకూడదని ఆలుమగలు బంగారం లాగే ఉండాలని ఆయన తపన!

అందుకే కలిపే రాగిని మంత్రించి, బంగారంలా చేస్తాడు.

మంగళసూత్రాలు చేస్తున్నప్పుడల్లా ఈ వస్తువు నూరేళ్ళపాటు కరిగించకుండా చూడు దేవుడా...అని గొట్టంతో ఊపిరిపోస్తాడు. సుత్తితో తాళమేస్తాడు.

ఆదిదంపతుల్ని మనస్సులో స్మరించుకుని- వారి ఆకృతుల్ని సూత్రపు బిళ్ళపై మంగళకరంగా చిత్రించి, ఇంకెవ్వరూ కల్పించలేనంత పవిత్రతని ఆపాదిస్తాడు.

అందుకే మా నాన్న నా పెళ్ళి సూత్రాలు ఇతనితోనే చేయించాడు. అప్పటికతని వయస్సు బహుశా నా వయస్సే ఉండొచ్చు.

ఇప్పుడు మా మనవరాలు పెళ్ళి. నా ముచ్చట ఏంటంటే రెండు మంగళసూత్రాలూ నేనే చేయిద్దామని. మగపెళ్ళి వారితో కరాఖండిగా చెప్పేశా. రెండు మంగళ సూత్రాల ఖర్చులూ నావేనని!

పెద్దవాణ్ణి గదా..ఒప్పుకున్నారు రెండువైపులవారూ.

''మా మనవరాలి పెళ్ళయ్యా! వచ్చే నెల పద్దెనిమిదో తారీఖు ముహూర్తం. నువ్వే మంగళసూత్రాలు చేయాలి. నేనే కానుక ఇద్దామని నిశ్చయం చేసుకున్నా''

''చాలా సంతోషం శెట్టిగారూ! ఈసారి శివపార్వతుల బొమ్మేసి మంగళసూత్రాలు తయారు చేస్తాను. ఆదిదంపతుల్లా ఆ దంపతులు పదికాలాల పాటు చల్లగా కలిసుంటారు''

''నీ హస్తవాసీ గొప్పదే! నీ మాట తీరూ గొప్పదే!'' అని నేను పని పురమాయించి, బయల్దేరబోతుండగా..

''తాతయ్యా! కాఫీ'' అంటూ రెండు గ్లాసుల్తో కాఫీ తెచ్చి మా ఇద్దరికీ ఇచ్చింది. ఆమె రామాచారి మనవరాలు రజని!

పిల్ల బంగారు బొమ్మలా ఉంది.

క్షణం సేపు ఈర్ష్య పడ్డాను. నా మనవరాలు ఇంత బావుంటే ఎంత బావుండును- అనుకున్నా. బంగారం చేసే వాళ్ళింట్లో బంగారం లాంటి పిల్లలే పుడతారని నేను విన్నమాట జ్ఞాపకం వచ్చింది.

## మళ్ళీ రైటరు మాట

మంగళసూత్రాలు కంసాలి దగ్గర్నుంచీ తీసుకెళ్ళడం ఓ అందమైన వేడుక.

దుప్పటిని నలుగురూ నాల్గు వైపులా పట్టుకుని ఒకళ్ళు మధ్యలో కర్రనెత్తి గొడుగులా పట్టుకుంటారు.

మంగళసూత్రాలు చేసిన కంసాలికి కొత్త బట్టలు పెట్టి ఆ రోజు గ్రాసానికి స్వయంపాకమిచ్చి, అతను చేసిన మంగళసూత్రాల్ని మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకువెళ్తారు.

ఇపుడంటే ఎర్రకాగితంలో చుట్టిన మంగళసూత్రాన్ని ప్లాస్టిక్ డబ్బాలో పెట్టిస్తే, హాండుబ్యాగులోనో, జేబులోనో పెట్టి తెచ్చేస్తున్నారుగానీ...

అప్పటిరోజుల్లో అదో సంబరం! పవిత్ర బంధానికి ప్రధాన బంధమైన ఈ మంగళసూత్రాలు ముత్తయిదువతనానికి ప్రతీకగా భావిస్తారు.

ఆ రోజు కట్టిన మాంగల్యం జీవితాంతం మెళ్ళో ఉండాలని గుండెకి మంగళసూత్రా

లను హత్తు
కుంటూ మనస్ఫూర్తిగా తలదించుకుని ప్రార్థిస్తూ మూడు ముళ్ళూ వేయించు కుంటుంది పెళ్ళికూతురు.

ఆడపిల్ల నూరేళ్లపాటు ఉంచుకోవాలనే మాంగల్యాన్ని అంత శ్రద్ధాసక్తులతోనూ తయారుచేస్తాడు రామాచారి.

కానీ రామాచారి మనవరాలికి చేసిన మంగళసూత్రం మాత్రం అచ్చిరాలేదు.

రామాచారికి, అతని పనికీ పిడుగు పాటు ఈ కథలోని అసలు కథ.

మనవరాళి పెళ్ళికి సీతారాముల బొమ్మలతో మంగళసూత్రాలు చేశాడు. రామాలయానికెళ్ళి సీతారాముల ముందు పెట్టి, అక్కణ్ణుంచి ఊరేగింపుగా తీసుకొస్తున్నాడు.

కాసేపట్లో ఎదురు సన్నాహాలు!

పెళ్ళికొడుకొస్తాడని ఎదురుచూపులు...!

పెళ్ళి హడావుడిలో ఉన్న రామాచారికి పిడుగులాంటి వార్త అందింది.

తాళి కట్టకుండానే రాబోయే భర్త కాని ఆ వరుడు అవతారం పూర్తి చేసుకున్నాడు.

ఆ అమ్మాయి ఆ తర్వాత ఎవర్నీ చూడ్డానికొప్పుకోలేదు.

ఆ మంగళసూత్రాలు రామాచారి ఎవ్వరికీ అమ్మనూ లేదు.

ఆవేళ్టినుంచి పుణ్యపునీతగానే మిగిలిపోయింది గానీ పుణిస్త్రీగా రామాచారి మనవరాలు ముద్ర వేయించుకోలేదు.

కానీ రామాచారి మాత్రం ఆవేళ్టినుంచీ ఎప్పుడూ మంగళసూత్రాలు తయారు చేయలేదు.

ఇప్పటికీ రామాచారి దగ్గరికి ఎవరైనా వెడితే మట్టెలూ- మంగళసూత్రాలు చేయనని చెబుతాడు.

☆

